# కార్యకర్తలే కొండంత బలం

- ప్రజలు ఆలోచించి ఓటు వేయాలి: ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి


ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరుతున్న మేకలసోంపల్లికి చెందిన కార్యకర్తలు

గద్వాల, అక్టోబర్ 20 : కార్యకర్తలే తనకు కొండంత బలమని, వారి కోసం ఎంతవరకైనా పోరాడుతానని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని క్యాంప్ కార్యాలయంలో ధరూర్‌కు చెందిన బీజేపీ ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు రామన్నతోపాటు 30మంది, గద్వాల మండలం లత్తిపురం, వెంకంపేట గ్రామాలకు చెందిన 160మంది, మల్దకల్ మండలం మేకలసోంపల్లి, సద్దోలోనిపల్లికి చెందిన బీజేపీ, కాంగ్రెస్ కార్యకర్తలు 300 మంది, కేటీదొడ్డి మండలం కుచినెర్ల, తూర్పుతండాకు చెందిన బీజేపీ, కాంగ్రెస్ కార్యకర్తలు, గద్వాల జిల్లా 7వ వార్డు పిల్లిగుండ్లకాలనీకి చెందిన మహిళలతోపాటు 130మంది గులాబీ తీర్థం పుచ్చుకున్నారు. వారందరికీ ఎమ్మెల్యే, ఆయన సతీమణి జ్యోతి పార్టీ కండువా కప్పి బీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తండాలను గ్రామ పంచాయతీలుగా మార్చిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. మహిళల కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిందన్నారు. మరింత అభివృద్ధి జరగాలంటే మళ్లీ బీఆర్‌ఎస్ అధికారంలోకి రావాలని, అందుకు ప్రజల సహకారం అవసరమని చెప్పారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే మూడు గంటల కరెంట్ వస్తుందని, బీజేపీకి ఓటు వేస్తే మోటర్లకు మీటర్లు బిగిస్తారన్నారు. అటువంటి పార్టీలు అధికారంలోకి రావాలో, ప్రజలకు 24 గంటల కరెంటిచ్చే బీఆర్‌ఎస్ అధికారంలోకి రావాలో ప్రజలే ఆలోచించుకొని ఓటు వేయాలని సూచించారు. జిల్లాలో కాంగ్రెస్ అరాచక శక్తులను పెంచి పోషిస్తుందని మండిపడ్డారు. కర్ణాటకలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఆరు నెలలైనా ఒక్క హామీ కూడా నెరవేర్చలేదన్నారు. అలాంటి తెలంగాణలో ఆరు పథకాలు అమలు చేస్తామంటే ఎలా నమ్ముదామన్నారు. కాంగ్రెస్ నాయకులకు కరెంట్ గురించి మాట్లాడే ధైర్యం లేదని ఎద్దేవా చేశారు. సంక్రాంతికి గంగిరెద్దులోళ్లు వచ్చినట్లు ఎన్నికల వేళ కాంగ్రెస్, బీజేపీ నాయకులు ఓట్ల కోసం వస్తుంటారని, వారికి జరిగిన అభివృద్ధిని వివరించి తిప్పి పంపాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కేశవ్, ఎంపీపీ ప్రతాప్‌గౌడ్, జెడ్పీటీసీ ప్రభాకర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ సుభాన్, రాష్ట్ర వినియోగదారుల ఫోరం చైర్మన్ గట్టు తిమ్మప్ప, కౌన్సిలర్ దౌలు, నాయకులు పటేల్ ప్రభాకర్‌రెడ్డి, రమేశ్‌రెడ్డి, కోడిగుడ్ల సలాం, రమేశ్ నాయుడు, గోవిందు, రామకృష్ణనాయుడు తదితరులు పాల్గొన్నారు.

## కాత్యాయనీదేవి అవతారంలో
# జోగుళాంబ

- వైభవంగా ఆదిదంపతుల కల్యాణం
- అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించిన కర్నూల్ కలెక్టర్ దంపతులు
- అధిక సంఖ్యలో హాజరైన ప్రజలు


కాత్యాయని అవతారంలో అమ్మవారు

అలంపూర్, అక్టోబర్ 20 : అలంపూర్‌లోని జోగుళాంబ బాలబ్రహ్మేశ్వరస్వామి ఆలయాల్లో శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం అమ్మవారు కాత్యాయనీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారికి అర్చకులు శోడషోపచార, ప్రదోషకాల పూజలు, చండీహోమాలు, త్రిశతి అర్చన, సాయంత్రం సహస్ర నామార్చన, రాత్రి ఏడు గంటలకు దశవిధ హారతుల అనంతరం అమ్మవారు కాత్యాయనీగా దర్శనమిచ్చారు. ఆలయాలను భక్తులు అధికసంఖ్యలో దర్శించుకున్నారు.

**అమ్మవారికి పట్టువస్త్రాల సమర్పణ**

ఉత్సవాల సందర్భంగా జోగుళాంబ బాలబ్రహ్మేశ్వరస్వామి ఆలయాలను కర్నూల్ కలెక్టర్ సృజన దర్శించుకుని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరపున పట్టువస్త్రాలు సమర్పించారు. ముందుగా ఆయా ఆలయాల్లో పూజల అనంతరం అర్చకులు ఆశీర్వదించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. వారి వెంట ఉమ్మడి రాష్ట్ర ఎండోమెంట్ మాజీ కమిషనర్ జయరామయ్య తదితరులు ఉన్నారు. ప్రిన్సిపల్ సెక్రటరీ లేబర్ రాణి కుమిదినీ అమ్మవారిని దర్శించుకోగా వారికి ఆలయ ఈవో పురేందర్‌కుమార్, ఆలయ కమిటీ చైర్మన్ చిన్న కృష్ణయ్యానాయుడు అర్చకులతో కలిసి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు.


అమ్మవారికి పట్టువస్త్రాలు తీసుకొస్తున్న కర్నూల్ కలెక్టర్ దంపతులు

**కమనీయం కల్యాణం**

కనుల పండువగా ఆదిదంపతుల కల్యాణం శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆరో రోజు జోగుళాంబా బాలబ్రహ్మేశ్వరస్వామి వారి కల్యాణాన్ని కనుల పండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి ఆలయంలో ఉత్సవ విగ్రహాలకు సంప్రదాయపద్ధతిలో అర్చకులు కల్యాణం జరిపించగా భక్తులతోపాటు కర్నూలు కలెక్టర్ సృజన కుటుంబసభ్యులు కల్యాణాన్ని తిలకించారు. ఆదిదంపతుల మూల విరాట్‌లను పల్లకీలో ఉంచి అమ్మవారి దీక్షభక్తులు ప్రదక్షిణలు చేశారు. దేవస్థాన అన్నదాన సత్రంలో భక్తులు ఉచిత అన్న ప్రసాదంను స్వీకరించారు. సాయంత్రం స్వామివార్లను సింహ వాహనంపై ఆశీనులను చేసి పురవీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో పురేందర్‌కుమార్, పాలకమండలి సభ్యులు, ఆలయ సిబ్బంది, భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

**రాష్ట్రాలు వేరైనా సంప్రదాయలు ఒక్కటే**

ఉండవెల్లి, అక్టోబర్ 20 : తెలుగు రాష్ట్రాలు వేరైన సంప్రదాయలు ఒక్కటేనని కర్నూల్ కలెక్టర్ సృజన పేర్కొన్నారు. అలంపూర్ చౌరస్తా విశ్వశాంతి కాలేజీలో నిర్వహించిన సంబురాల్లో కలెక్టర్ కుటుంబసభ్యులతో కలిసి పాల్గొని బతుకమ్మకు ప్రత్యేక పూజలు చేశారు. విద్యార్థులతో కలిసి ఆడిపాడారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో కలెక్టర్ భర్త రవితేజ, విశ్వశాంతి కాలేజీ ప్రిన్సిపాల్ మంజుల మురళీధర్‌రెడ్డి, రామిరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గద్వాల జిల్లా కేంద్రంలోని రాజవీధి వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారిని రూ.1,11,11,111 నోట్లతో అలంకరించారు. అదేవిధంగా అమ్మవారికి విశిష్ట పూజలు నిర్వహించారు. సాయంత్రం మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని కుంకుమార్చన చేశారు. - గద్వాల టౌన్, అక్టోబర్ 20


కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు

## ఎన్నికలు
# సజావుగా జరగాలి

- బెల్ట్ షాప్స్‌పై ప్రత్యేక నిఘా
- ఇప్పటివరకు 39 కేసులు నమోదు
- రూ.57లక్షలకు పైగా గ్రీవెన్స్ కమిటీకి అప్పగించాం..
- జిల్లాకు సరిహద్దులో ఐదు చెక్‌పోస్టులు ఏర్పాటు: ఎస్పీ రితిరాజ్

గద్వాల అర్బన్, అక్టోబర్ 20 : జిల్లాలో అసెంబ్లీ ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు అన్ని విధాల చర్యలు చేపట్టినట్లు ఎస్పీ రితిరాజ్ పేర్కొన్నారు. ఎస్పీగా బాధ్యతలు స్వీకరించాక జిల్లా పోలీస్ కార్యాలయంలో శుక్రవారం తొలిసారి మీడియా సమావేశం నిర్వహించి మాట్లాడారు. రాబోయే ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని ఎన్నికల కోడ్ పాటిస్తూ సజావుగా నిర్వహించేందుకు పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నామన్నారు. జిల్లాకు ఆంధ్రప్రదేశ్, కర్ణాటక సరిహద్దుగా ఉన్న ప్రాంతాల్లో 5 చెక్‌పోస్టులు ఏర్పాటు చేశామన్నారు. ఎన్నికల కోడ్ వచ్చినప్పటి నుంచి సీజ్ అయిన నగదు, పట్టుబడిన లిక్కర్, ఇతర వస్తువుల వివరాలను వెల్లడించారు. నగదుకు సంబంధించి 39 కేసులు నమోదు చేసి రూ.57లక్షలకు పైగా నగదును గ్రీవెన్స్ కమిటీకి అప్పగించామన్నారు. లిక్కర్‌కు సంబంధించి 1,292.33 లీటర్ల మద్యం(వాటి విలువ రూ.7లక్షలకు పైగా)సీజ్ చేశామన్నారు. చీరలు, ఇతర వస్తువులకు సంబంధించిన (రూ.37లక్షలకు పైగా) వాటిని సీజ్ చేసినట్లు వివరించారు. గ్రామాల్లో బెల్ట్ షాప్స్‌పై ప్రత్యేక నిఘా ఉంచామన్నారు. ఎన్నికలకు జిల్లా పోలీస్‌కు అదనంగా సెంట్రల్ సీఏపీఎఫ్ దళాలు వస్తున్నట్లు వెల్లడించారు. సమావేశంలో అదనపు ఎస్పీ రవి తదితరులు ఉన్నారు.

### నేటి నుంచి పోలీస్ అమరవీరుల సంస్మరణ కార్యక్రమాలు

శనివారం నుంచి ఈనెల 31వ తేదీ వరకు పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా పలు కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఎస్పీ ప్రకటనలో పేర్కొన్నారు. పోలీసులు, ప్రజల సహకారంతో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పరేడ్ మైదానంలో 21వ తేదీన మెగా రక్తదాన శిబిరం, ఎర్రవల్లిలోని బెటాలియన్‌లోనూ శిబిరం నిర్వహిస్తామన్నారు. ఈక్రమంలో పాత బస్టాండ్ నుంచి ఎస్పీ కార్యాలయం వరకు ర్యాలీ, అమరవీరులను స్మరిస్తూ వారికి నివాళులర్పిస్తామన్నారు. కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరవుతారన్నారు. 23వ తేదీన విద్యార్థులకు వ్యాసరచన పోటీలు, 26న సైకిల్ ర్యాలీ, 29వ తేదీన విద్యార్థులకు గద్వాల టౌన్ పీఎస్‌లో పోలీసులు వినియోగించే ఆయుధాలు, వారి విధులు, అత్యవసర పరిస్థితుల్లో చేయాల్సిన పనులపై అవగాహన కార్యక్రమం, షార్ట్ ఫిల్మ్, ఫొటోగ్రఫీ తదితర పోటీలు, నిర్వహిస్తామన్నారు. అందరూ పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు.

# నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

- కలెక్టర్ వల్లూరు క్రాంతి


రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న కలెక్టర్ క్రాంతి

గద్వాల, అక్టోబర్ 20 : త్వరలో జరగనున్న శాసనసభ ఎన్నికలకు సంబంధించిన మొదటి విడత రాండమైజేషన్ ప్రక్రియ పూర్తయిందని కలెక్టర్ వల్లూరు క్రాంతి తెలిపారు. శుక్రవారం ఐడీవోసీ సమావేశ హాల్‌లో వివిధ రాజకీయపార్టీల ప్రతినిధుల సమక్షంలో స్ట్రాంగ్ రూంలోని కంట్రోల్, బ్యాలెట్ యూనిట్లు, వీవీప్యాట్ల రాండమైజేషన్ మొదటి దశ నిర్వహించారు. ప్రక్రియ పూర్తి చేసి స్క్రీన్ ద్వారా వారికి చూయించారు. మూడు రౌండ్లు పూర్తయిన తర్వాత ఫైనల్ చేస్తామని కలెక్టర్ తెలిపారు. జిల్లాలోని గద్వాల, అలంపూర్ నియోజకవర్గాలకు అలాట్ చేస్తామని చెప్పారు. మొదటి దశ పూర్తయిన కంట్రోల్, బ్యాలెట్ యూనిట్లు, వీవీప్యాట్‌ల జాబితాను రాజకీయ పార్టీల ప్రతినిధులకు అందజేశారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు రాజకీయ పార్టీల ప్రతినిధులు కృషి చేయాలన్నారు. ఎన్నికల్లో డబ్బు, మద్యం వంటి ప్రలోభాలకు గురి చేయకుండా ఓటరు ప్రశాంతంగా తన ఓటు హక్కును వినియోగించుకునేలా చూడాలని కోరారు. ఎన్నికల నియమావళిని అన్ని రాజకీయ పార్టీలు పాటించాలని సూచించారు. రాజకీయపార్టీల ఎన్నికల నిబంధనల ఉల్లంఘనలపై ఎప్పటికప్పుడు అధికారులు నిఘా ఉంచాలన్నారు. ఇతరులకు ఇబ్బందులు కలుగకుండా తమ ప్రచారాన్ని కొనసాగించాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు శ్రీనివాస్, అపూర్వచౌహాన్, ఆర్డీవో చంద్రకళ, తాసీల్దార్ నరేందర్, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.